
వైద్యమో జగనన్నా!

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు బంద్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 25 : నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గురువారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయడంతో జిల్లావ్యాప్తంగా తొలిరోజే రోగులపై తీవ్ర ప్రభావం చూపింది. శస్త్ర చికిత్సలకు ప్యాకేజీల పెంపు, పాత బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం ఇచ్చిన హామీకి కార్యరూపం ఇవ్వకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నట్టు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించింది. జిల్లాలో 29 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గురువారం కొత్తగా ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులను చేర్చుకోలేదు. ఫలితంగా ఈ పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోజుకు 550 మంది అవుట్ పేషెంట్లు, గరిష్ఠంగా 240 మంది ఇన్ పేషెంట్లలో పలువురు వైద్య చికిత్సలకు దూరమయ్యారు. జిల్లాలో ఏ ఒక్క నెట్‌వర్క్ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ కింద కొత్తగా అడ్మిషన్లు నిరాకరించలేదని, గురువారం అన్ని ఆస్పత్రుల్లోనూ చికిత్సలు అందాయని ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ వెల్లడించారు. 'ఒకవేళ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకోకపోయినా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రి, మరో 9 ప్రాంతాల్లో సీహెచ్‌సీలు, మూడుచోట్ల ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఎమర్జెన్సీ కేసులైన గైనిక్, డెలివరీ కేసులను సమీప ప్రభుత్వాస్పత్రులకు తరలిస్తాం' అని చెప్పారు. అధికార వర్గాలు ఇలా చెబుతున్నప్పటికీ పలు ఆస్పత్రుల్లో కొత్తగా పేషెంట్లను చేర్చుకోవడం లేదన్నది బహిరంగ రహస్యం. ఆ మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో బహిరంగంగా బోర్డులు ప్రదర్శించకుండా చికిత్సల నిమిత్తం వచ్చే రోగులకు ఆరోగ్య శ్రీ కింద అడ్మిషన్ ఇవ్వలేమని, చికిత్సకయ్యే ఖర్చును సొంతంగా భరించగలిగితేనే ఆస్పత్రిలో చేరాలని యాజమాన్యాలు తమ ప్రతినిధులతో చెప్పించాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల్లో ఆర్థికంగా ఖర్చులు భరించగలిగే వారు ఉండగా, పేద రోగులు చికిత్సను వాయిదా వేసుకోవడమో లేదా ప్రభుత్వాస్పత్రికి తరలి వెళ్లడమో జరిగింది.

6.33 లక్షల ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు

జిల్లాలో 6,33,227 ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను జారీ చేశారు. మొత్తం 3,225 రకాల రోగాల(ప్రొసీజర్స్)కు ఆరోగ్యశ్రీలో చికిత్సలను నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో అందించాలి. కీలకమైన ప్రసూతి సేవలు, ప్రసవాలు, గుండె జబ్బులు, కేన్సర్, కిడ్నీ, లివర్, దీర్ఘకాలిక జబ్బులు సంబంధిత రోగాలకు చికిత్సలు అత్యవసరంగా పరిగణిస్తారు. ఈ రోగాలు ముదిరితే వైద్య నిపుణుల సూచనల మేరకు వెంటనే శస్త్ర చికిత్సలు చేయాలి. ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో సంబంధిత తీవ్రరోగాలతో శస్త్రచికిత్సలు అవసరమైన రోగుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇతర ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవానికి రూ.15 వేలు, సిజేరియన్ ఆపరేషన్‌కు రూ.30 వేల వరకు వసూలు చేస్తుంటారు. ఇపుడు నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యసేవలను నిలిపివేయడంతో డెలివరీ కేసులకు సైతం ఆస్పత్రి నిర్దేశించిన మొత్తాన్ని భరించాల్సిందే. ఇదే పరిస్థితి మిగతా రోగులకు, శస్త్ర చికిత్సలకు ఎదురవుతుంది. ఆరోగ్యశ్రీ వైద్యసేవల నిలిపివేత మరికొన్నిరోజులు కొనసాగితే ప్రభుత్వ వైద్యసేవలపై ఆధారపడిన పేదరోగులకు మరిన్ని కష్టాలు తప్పవు. కాగా ఆరోగ్యశ్రీ అడ్మిషన్ల నిలిపివేతకు దారితీసిన కారణాలపై ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వాన్నే తప్పుబడుతున్నాయి. శస్త్రచికిత్సల ప్యాకేజీలు పెంచాలని, బిల్లులు బకాయిలు లేకుండా త్వరితగతిన చెల్లించేలా ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాలని పలుమార్లు అభ్యర్థించినా ప్రభుత్వం నుంచి స్పందన కరవైనందునే ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సివచ్చిందని చెబుతున్నాయి.



విద్యుద్దీపాల వెలుగులో కలెక్టరేట్

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నేడు గణతంత్ర వేడుకలు

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, జనవరి 25 : భారత 75వ గణతంత్ర దినోత్సవ జిల్లా స్థాయి వేడుకలు శుక్ర వారం ఉదయం 9 గంటలకు ఏలూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రారంభం అవుతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ తదుపరి పోలీసుల గౌరవ వందనం, 9.15 నిమిషాలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సందేశం, 9.30కి పోలీస్ కవాతు, 10 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20కి సాంస్కృతిక కార్యక్రమాలు, 10.55కి ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత, 11.35కి స్టాల్స్ సందర్శన జరుగుతాయన్నారు. కాగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఫైనల్ రిహార్సల్ గురువారం జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో నిర్వహించారు. పోలీస్ కవాత్‌ను పరిశీలించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు.



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పోలవరాన్ని వదిలేశారు

సభలో మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల



వైసీపీపై విరుచుకుపడిన షర్మిల

- ప్రాజెక్టు వ్యయం పెంచేశారు
- ప్రత్యేక హోదాను గాలికొదిలేశారు
- ఉద్యోగాలు లేవు.. పరిశ్రమలు రాలేదు
- ఎదురేగి స్వాగతం పలికిన కేడర్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

'పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండేది. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టును తన కలగా భావించారు. కాని జగన్ మాత్రం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అదీ 2021లోపేనని పదేపదే చెప్పినా పూర్తి చేయకపోగా ఎత్తు తగ్గించి వదిలేశారు' అంటూ ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాక మునుపు ఒక తీరు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకొక తీరుగా జగనన్న పాలన ఉందంటూ విరుచుకుపడ్డారు. ఏలూరు జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 'ఒకప్పుడు రాజశేఖరరెడ్డి 4 వేల 500 కోట్లతో ప్రాజెక్టు పనులు ప్రారంభించి పది వేల కోట్లు అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. వైఎస్ తరువాత ప్రాజెక్టు గురించి ఎవరికీ పట్టలేదు. చంద్రబాబు హయాంలో దీని నిర్మాణం నిమిత్తం 10 వేల 500 కోట్లు వచ్చినా ప్రాజెకు పూర్తి చేయలేదు. కేంద్రంతో పోరాడి నిధులు రాబట్టాల్సి ఉన్నా అలా చేయలేదు. పనులన్నీ ముందుగా మేమే చేసేస్తాం, ఆ తర్వాత నిధులు ఇవ్వండంటూ చంద్రబాబు వ్యవహరించారు. ప్రాజెక్టు పూర్తయ్యి ఉండి ఉంటే ఈ ప్రాంతం అన్నపూర్ణగా పంటలతో వెలిగేది. 2021లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని పదేపదే జగనన్న చెబుతూ వచ్చారు. అంచనా వ్యయం కాస్తా రూ.55 వేల కోట్లకు పెరిగింది. తీరా అసలు విషయానికి వచ్చేసరికి నిర్మాణ పనులకు నిధులు రాబట్టలేకపోయారు. ప్రాజెక్టు నిర్మాణంలో అనవసర జాప్యం కొనసాగింది' అంటూ ధ్వజమెత్తారు. 'రాష్ట్రంలో ముఖ్య నేతలంతా బీజేపీకి బానిసలు మారారు. రాష్ట్రాన్ని పరోక్షంగా పాలించేది బీజేపీనే. పోలవరం పూర్తి చేసి ఉంటే బీజేపీని ఎవరైనా ఒప్పుకోవచ్చు. అది కూడా కాలేదు ఎందుకని ..? కాంగ్రెస్ శ్రేణులు తాజా పరిణామాలను ప్రత్యక్షంగా గమనించాలి. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీతోనే కుమ్మక్కయ్యాయి. ఈ పరిణా మాలను ప్రజలకు వివరించండి. ఈ తరహా పొత్తులపై రాష్ట్ర ప్రజలు ఓ కన్నేసి ఉంచాలి. ప్రత్యేకించి కాంగ్రెస్ వస్తేనే హోదా, పోలవరం నిర్మాణం పూర్తవుతాయి..' అంటూ పేర్కొన్నారు.



సభలో కార్యకర్తల సందడి

సీనియర్ నేత కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ 'షర్మిల నాయకత్వం కాంగ్రెస్‌లో ఉత్సాహంగా ప్రారంభమైంది. సమాజంలో మార్పు కనపడుతోంది. ఇది మంచి పరిణామం. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించిన వారిలో నేనొకడిని. ఇందులో భాగంగానే పులివెందులలో సభ నిర్వహించాం. అప్పటి నుంచి వై.ఎస్‌ను వెంటపెట్టుకుని ఉన్నాం. ఇప్పుడు పీసీసీ అధ్యక్ష హోదాలో ఉన్న షర్మిలను వెనుక ఉండి నడిపిస్తాను' అంటూ ప్రకటించారు. రాష్ట్రంలో రాజకీయ పోకడలు వేగంగా మారుతున్నాయి. ఈలోపే పీసీసీ సారథిగా షర్మిల వచ్చారు. ఇక కాంగ్రెస్‌కు తిరుగులేదు. ఇకపై షర్మిల అడుగులో అడుగేయడమేనని నరసాపురం పార్లమెంటరీ కన్వీనర్ జెట్టి గురునాథరావు కేడర్‌కు పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు షర్మిల రూపంలో కొత్త భవిష్యత్తు కనపడుతుందని, నేతలు, కేడర్ ఇక నిరంతర శ్రమకు పార్టీని పూర్తిగా నిలదొక్కుకోవడానికి వచ్చే ఎన్నికల్లో ఆధిపత్యం సాధించేందుకు కష్టించి పనిచేస్తామని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, మార్నీడు బాబీ స్పష్టం చేశారు. షర్మిల దారిలోనే అందరం కలిసికట్టుగా పయనిస్తామని దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డి.వి.ఆర్.కె.చౌదరి, మరో సీనియర్ నేత ముప్పిడి శ్రీనివాసరావు అన్నారు.

సందడే సందడి

సుదీర్ఘ కాలం తర్వాత కాంగ్రెస్‌లో సందడి వాతావరణం నెలకొంది. ఏలూరులో గురువారం షర్మిల పర్యటించినప్పుడు పాత, కొత్త తరం తరలివచ్చింది. పాతబస్టాండ్ సమీపాన షర్మిలకు ఎదురేగి స్వాగతం పలికారు. కార్యకర్తల సమావేశ మందిరం కిక్కిరిసింది. నేతలంతా షర్మిల వెంటే తామంతా అంటూ గంభీరంగా ప్రకటిస్తున్నప్పుడు మరికొందరు సీఎం సీఎం అంటూ నినదించారు. సమావేశానికి ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు, సీనియర్ నేతలు పల్లం రాజు, జె.డి.శీలం, రఘువీరారెడ్డి, వినయ్‌కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొనగా ఎన్ఆర్ఐ కావూరి లావణ్యతో సహా అనేకమంది షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పానీపూరి తిని ఇద్దరు చిన్నారుల మృతి..!

- జంగారెడ్డిగూడెంలో తీవ్ర కడుపు నొప్పితో అన్నదమ్ములు మృత్యువాత
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

7

హడావుడిగా తనిఖీలు...


జంగారెడ్డిగూడెం, జనవరి 25 : జంగారెడ్డిగూడెంలో ఇప్పటి వరకు కంటికి కనపడని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు గురువారం సాయంత్రం హడావుడి చేశారు. ఫుడ్ పాయిజన్ అయి ఇద్దరు పిల్లలు మృతి చెందారని మీడియాలో కథనాలు రావడంతో అప్పటికప్పుడు రంగంలోకి దిగారు. పట్టణంలోని పలు రెస్టారెంట్‌లు, హోటళ్లను తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించని వాటికి నోటీసులు అందించారు. తనిఖీల్లో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కావ్యరెడ్డి, తహసీల్దార్ స్లీవ జోజి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.




తుది ఓటర్ల జాబితా తప్పుల తడక

- ఒకరికి మూడు.. మరొకరికి రెండు ఓట్లు..
- చనిపోయిన వారి ఓట్లు తొలగించలేదు

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్/ఆకివీడు/కాళ్ల/ మండవల్లి, జనవరి 25 : ఓటరు జాబితాలను పగడ్బందీగా సిద్ధం చేయాలని చెబుతున్నప్పటికి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తప్పులు దొర్లాయి. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు తొలగించలేదు. ఒకే వ్యక్తికి రెండు, మూడుచోట్ల ఓట్లు కలిగి ఉన్నాయి. ఒక గ్రామానికి చెందిన వారికి మరో గ్రామంలో ఉండడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా తారుమారు కావడం అధికారుల తప్పిదమేనని వారు ఆరోపిస్తున్నారు. ఓటర్ల తుది జాబితాలు ఈ నెల 22న విడుదలయ్యాయి. ఆకివీడు పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో లోపాలున్నాయి. ఓటర్ల జాబితాల సెట్లు తమకే పూర్తిగా రాలేదు. ఇక ఎలా ఇస్తామంటూ సంబంధిత అధికారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఒక వార్డులో వున్న ఓటర్ల పేర్లు మరో వార్డులో ఉన్నట్టు సమాచారం. నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేయలేదు. తుది జాబితాల్లో తమ ఓటు ఉందో లేదో చూసుకుందామంటే లిస్టులు ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- పెంటపాడు మండలంలోని చాలా గ్రామాల్లోని ఓటర్ల పేర్లలో అక్షర దోషాలు, డబుల్ ఎంట్రీలు ఎక్కువగా కనిపించాయి. అలంపురం గ్రామంలో చేట్రది ఖాను అనే మహిళకు 165, 166 పోలింగ్ కేంద్రాల్లో రెండు ఓట్లు ఉన్నాయి. అధికారులు మాత్రం 166లో ఆమె ఓటు తొలగింపునకు ప్రతిపాదనలు పంపిచామని చెబుతున్నారు.
- తాడేపల్లిగూడెం కొబ్బరితోటకు చెందిన కాకి గుణరాం పేరుతో పోలింగ్ బూత్ నెంబర్ 121 పరిధిలో 890, 886 నెంబర్లతో రెండు ఓట్లు వచ్చాయి. తణుకు నియోజకవర్గం అత్తిలిలో 115వ పోలింగ్ బూత్ పరిధిలో మరో ఓటు ఉంది. ఈ లెక్కన మొత్తం మూడు ఓట్లు ఉన్నాయి.



- తాడేపల్లిగూడెం పట్టణంలోని 110వ పోలింగ్ బూత్ పరిధిలో పతి సునీల్ కుమార్ ఫొటో లేకుండా ఓటరు జాబితాలో పేరు మాత్రమే ముద్రించారు.



- ఆకివీడు ఎనిమిదో వార్డుకు చెందిన బొడ్డు హరినారాయణ, వలివేటి శంకరం, బళ్ళ రామారావు మరణించారు. ఓటర్ల జాబితాలో వీరి పేర్లు తొలగించలేదు.





- కాళ్ల మండలం బొండాడలో మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లిఖార్జునరావు ఓటును తొలగించారు. ఆయన భార్య మాజీ సర్పంచ్ నాగమణి కొన్ని నెలలు క్రితం అనా రోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె ఓటు తొలగించకుండా మల్లికార్జునరావు ఓటును తొలగించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీనిపై బీఎల్‌వో రాజబాబు వివరణ ఇస్తూ మల్లిఖార్జునరావు ఓటు మార్పు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు వచ్చిందని, ఈ మేరకే డిలీట్ చేశామన్నారు. ఆయన భార్య నాగమణి చనిపోయినా ఓటు ఎందుకు తొలగించలేదని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదు.
- మండవల్లి మండలం లోకుముడిలో కాగిత మణి కుమార్, పండు ఆంజ నేయులు, పండు అక్కమ్మ, కాగిత దేవమణి మృతి చెందగా ఓటర్ జాబితాలో వీరి పేర్లు ఉన్నాయి. వారు చనిపోయిన విషయం అధికారులకు తెలిసినప్పటికీ వాటిని కొనసాగిస్తున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు.



- మండవల్లి మండలం ఇంగిలిపాకలంకలో ముగ్గురు, మండవల్లిలో నలుగురు చొప్పున మృతి చెందినా వారి పేరున కూడా ఓట్లు ఉన్నట్లు సమాచారం. చనిపోయిన వారి ఓట్ల తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నది అంతుచిక్కని ప్రశ్న.

ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్



ఏలూరు సిటీ, జనవరి 25 : ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతీ ఒక్క పౌరుడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ద్వారా జిల్లాలో 16.24 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారు. తుది ఓటర్ల జాబితాను ఈనెల 22న విడుదల చేశాం. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ ఓటును పరిశీలించుకోవాలి. 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి లేదా, ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చు'.. అన్నారు. జేసీ లావణ్యవేణి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి తదితరులు ఓటు ప్రాముఖ్యతను వివరించారు. సభికులచే కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేత లకు బహుమతులు అందజేశారు. డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, హౌసింగ్ పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు, తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా ఆర్టీసీ ఆర్వో నరసింహరావు వ్యవహరిం చారు. గోదావరి సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల సహాయ కేంద్రం, మోడల్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ప్రతి ఎన్నికల లోను ఓటు హక్కు వినియోగించుకున్న ముద్దం సుబ్బారావు (101), దాట్ల శేషమరాజు, దేవరపల్లి కుటుంబరావు, పొన్నగంటి సూరమ్మ, మల్లెమొగ్గల సత్యనారాయణ, ముంతా విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుడు భీముని రమేష్ లను కలెక్టర్, జేసీ సత్కరించారు. నూతనంగా ఓటరుగా నమోదైన విద్యార్థులకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు.

రండి.. ప్రజారాజ్యాంగ పండుగ చేసుకుందాం

- అతి భారీ జాతీయ పతాకం నిర్వహణకు పది కోట్ల నిధి.. మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు చేతుల మీదుగా వేడుక
- కావూరి భాస్కర్ భారీ కార్యక్రమం


భోగాపురంలో 235 అడుగుల జాతీయ పతాక స్థూపం

ఏలూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):సాధారణంగా ఒక రాజకీయ కుటుంబం ఏదో తరహా చేస్తూ గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. దేశభక్తి జాతీయత వంటి అంశాల్లో ముడిపడే సేవలకు రాజకీయాల్లో చాలామంది దూరం. మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుటుంబం మాత్రం వినూత్నంగా జాతీయ పతాక గౌరవం నింగినంటాలని భావించింది. ఆయన తనయుడు కావూరి భాస్కర్ మదిలో పుట్టిన ఆలోచన మేరకు జాతీయ పతాకం నింగినం టేలా అందరి దృష్టి ఆకర్షించేలా నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్ష. 2011లో హైదరాబాద్‌లో 110 అడుగులు ఎత్తున జాతీయ పతాక స్థూపాన్ని ఆవిష్కరించారు. నిత్యం స్థూపం నిర్వహణ, వ్యయం ఆయనే స్వయంగా భరిస్తున్నారు. ఆ తర్వాత తన తండ్రి సాంబశివరావు ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఒక జాతీయ పతాక స్థూపం ఏర్పాటు చేయాలని భావించారు. 2016లో ఏలూరు సమీపాన జాతీయ రహదారి పక్కన 235 అడుగులు ఎత్తైన జాతీయ పతాక స్థూపాన్ని నిర్మించారు. రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన జాతీయ పతాక స్థూపమిది. ఈ మార్గాన ప్రయాణించే వేలాది మందికి జాతీయ పతాక ప్రతిష్ఠను చేరువ చేయగలిగారు. 80 సెంట్ల విస్తీర్ణంలో పతాకాన్ని ఆవిష్కరించడమే కాకుండా భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ఓ టూరిస్టు కేంద్రంగా విస్తరించాలని ఆయన భావించారు. భోగాపురం వద్ద దాదాపు 16 ఏళ్ళపాటు జాతీయ పతాక స్థూపం నిర్వహణ, వ్యయం భరిస్తూ వచ్చారు. తాజాగా గణతంత్ర దినోత్సవమైన శుక్రవారం ఈ జాతీయ పతాక స్థూపంపై భారీ జెండా, 80 సెంట్ల భూమితో సహా పది కోట్ల రూపాయల నిధిని ఆర్ఎస్ఎస్‌చే నిర్వహించబడే సంస్థకు తన తండ్రి సాంబశివరావు చేతుల మీదుగా అందించబోతున్నారు. ఈ భారీ జెండా ఉన్న స్థలాన్ని తనతండ్రి పేరిట 'సాంబశివ' స్థలంగా నామకరణం చేశారు. హైదరాబాద్‌లో కాని, ఇక్కడ భోగాపురంలో కాని అతిపెద్ద జాతీయ పతాకం గణతంత్ర దినోత్సవం రోజున, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున సామాన్యుడి చేతే ఎగుర వేయించడం భాస్కర్ ఎంచుకున్న ఒక కొత్త ఒరవడి. సామాన్యుడు సైతం దేశభక్తి జాతీయతకు కేరాఫ్‌గా ఉండాలన్నదే ఆకాంక్ష. భోగాపురంలో ఈసారి విజయవాడ శ్రీసమరసత గంగానమ్మ దేవాలయం పూజారి పెయ్యల గురవయ్య పతాకావిష్కరణ చేస్తారన్నారు. భారీ జాతీయ జెండాతోపాటు కోట్ల నిధిని ఆర్ఎస్ఎస్ అందిస్తున్నందున ప్రజా రాజ్యాంగం పండుగ చేసుకుందాం రండి అంటూ భాస్కర్ పిలుపునిచ్చారు.

మార్చి నెలాఖరు వరకు హైదరాబాద్‌కు స్పెషల్ రైళ్లు

నరసాపురం, జనవరి 25: నరసాపురం-హైదరాబాద్ మధ్య ప్రతి ఆదివారం నడుస్తున్న స్పెషల్ రైళ్లను మార్చి నెలాఖరు వరకు పొడిగిస్తూ గురువారం దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈనెలాఖరుతో గడువు ముగియనుంది. అయితే మార్చి 30 వరకు పొడిగించారు. 07631 హైదరాబాద్‌లో శనివారం రాత్రి 11.15 గంటలకు బయలుదేరే ఈరైలు ఉదయం 8.30 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరిగి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు 07632 నంబరుతో నరసాపురంలో బయలుదేరి ఉదయం 4.50 గంటలకు హైదరాబాద్ వెళుతుంది. ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, పాలకొల్లు మీదుగా నరసాపురం వస్తుంది.

రాష్ట్రస్థాయి బూత్ లెవెల్ అధికారిగా వీఆర్‌వో భాస్కర్



గవర్నరు నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్న వీఆర్‌వో భాస్కర్

ఉంగుటూరు, జనవరి 25 : రాష్ట్రస్థాయి ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగా ఉంగుటూరు మండలం అక్కుపల్లిగోకవరం గ్రామ వీఆర్‌వో ఎంవీఎస్ఎన్ భాస్కర్ ఎంపికయ్యారు. గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి 14వ ఓటర్ల దినోత్సవాన పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ భాస్కర్‌కు జ్ఞాపికను రూ.పదివేల నగదును అందించారు. ఈ మేరకు ఉంగుటూరు మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది భాస్కర్‌ను అభినందించారు. ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి అవార్డుల విభాగంలో కాగుపాడు గ్రేడ్-5 కార్యదర్శి జి.సోమరాజును ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగా గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ చేతుల మీదుగా అభినందించారు.

11న తాడేపల్లిగూడెంలో బీసీ బహిరంగ సభ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ చైతన్యవేదిక నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 25 : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్నా పేదలకు అన్నిరంగాల్లో సముచిత న్యాయం జరగడం లేదని బీసీ హక్కుల సాధనకై ఫిబ్రవరి 11వ తేదీన పెదతాడేపల్లి హైవేపక్కన తాడేపల్లిగూడెంలో బీసీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తరతరాలుగా అగ్రకులాల ఆధిపత్య శక్తులే రాజ్యమేలుతున్నాయని, ప్రత్యామ్నాయశక్తిగా బీసీలు ఎదగాలన్నారు. ఈనేపథ్యంలో బీసీ బహిరంగ సభ ద్వారా బీసీల గొంతు ఎత్తుదామన్నారు. జనగణనలో సమగ్ర కులగణన చేయాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా, బీసీ సబ్‌ప్లాన్, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ నాయకులు శివశ్రీ, ఉక్కుసూరి గోపాలకృష్ణ, అరటికట్ల త్యాగరాజాచారి, మల్లిపూడి రాజు, శరణాల శివవాణి, కట్టా శ్రీనివాస్, ఎం.లక్ష్మణస్వామి, కిలారపు బుజ్జి, పిచ్చుక ఆదిశేషు, ఎ.జయరామారావు, బి.లక్ష్మణరావు, టి.సూర్యనారాయణ, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

భీమవరం, జనవరి 25 : తణుకు మండలం వేల్పూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 వి.గంగాధర్‌రావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17.90 లక్షలు సొంత ఖాతాకు మళ్లించుకున్న అభియోగంపై చేసిన ప్రాథమిక విచారణలో రుజువైంది. గురువారం కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర్ రూ.17.90 లక్షల నిధులను విధివిధానాలు పాటించ కుండా వారి కార్యాలయం స్వీపర్ ఖాతాకు తొలుత మళ్లించి, తిరిగి అతడి సొంత ఖాతాలో అదే మొత్తాన్ని జమ చేశారు. ఈ విషయమై పంచాయతీ సర్పంచ్ ఫిర్యాదు చేయగా నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారితో విచారణ జరిపి ప్రాథమిక నిర్ధారణ మేరకు విధుల నుంచి సస్పెండ్ చేసి, పూర్తి విచారణకు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

కరుగోరుమిల్లిలో అక్రమంగా మట్టి రవాణా

ఆచంట, జనవరి 25: కరుగోరుమిల్లి నుంచి కొన్ని రోజులుగా అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమంగా మట్టిని తరలించేస్తున్నారని గ్రామానికి చెందిన అల్లం సూర్య ప్రకాష్ తెలిపారు. గ్రామంలో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పానీపూరి తిని ఇద్దరు చిన్నారుల మృతి..!

- జంగారెడ్డిగూడెంలో తీవ్ర కడుపునొప్పితో అన్నదమ్ముళ్ల మృత్యువాత
- పొట్టకూటి కోసం వచ్చిన కుటుంబంలో తీవ్ర విషాదం
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు




ఆసుపత్రి వద్ద రోధిస్తున్న తల్లి, బంధువులు
మృతులు అన్నదమ్ములు రామకృష్ణ, విజయ్(ఫైల్)

జంగారెడ్డిగూడెం, జనవరి 25 : పొట్టకూటి కోసం మైళ్ల దూరం వచ్చిన ఒక సంచార కుటుంబంలో విషాదం నెలకొంది. ముక్కుపచ్చలారని అన్నదమ్ముళ్ల ఇద్దరు గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. ఈ విషాద ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. వివరాలివి. కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన ఆరు కుటుంబాలు ఉపాధి కోసం రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చి స్థానిక రామచంద్రపురం వాటర్ ట్యాంక్ దగ్గర గుడారాలు వేసుకుని ఉంటున్నారు. నీలి మందు, ప్లాస్టిక్ సామానులను సమీప గ్రామాలకు వెళ్లి విక్రయిస్తుంటారు. వీరంతా 2009 నుంచి 2016 వరకు జంగారెడ్డిగూడెంలోనే ఉండి ప్లాస్టిక్ సామానులు అమ్ముకుంటూ జీవనం సాగించారు. 2016లో ఇక్కడ నుంచి వారి సొంత గ్రామానికి వెళ్లి మరలా తిరిగి ఇక్కడకు రెండు నెలల క్రితమే వచ్చారు. ఈ ఆరు కుటుంబాల్లో ఒక కుటుంబం అయిన బెయల్‌పాటి రవి, చిన్నజమ్మక్కలకు రామకృష్ణ (11), విజయ్(6) ఇద్దరు సంతానం. రామకృష్ణ స్థానిక రామచంద్రపురం ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా చిన్నకుమారుడు విజయ్ ఇంటి వద్దే ఉంటున్నాడు.

గంటల వ్యవధిలో ఇద్దరూ..

బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా పట్టణంలోని ఒక పానీ పూరీ బండి వద్ద పానీపూరీ తిన్నారు. తిరిగి ఇంటికి వచ్చి చిక్కుడుకాయ కూరతో భోజనం చేసి తమ గుడారంలో నేలపై నిద్రించారు. అయితే వీరిలో గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు చిన్న కుమారుడు విజయ్ భరించలేని కడుపునొప్పి వస్తోందని ఏడవడంతో స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. బాలుడు పెదనాన్న బెయిల్‌పాటి శ్రీను, కుటుంబ సభ్యులు విజయ్‌ను ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో రాజమండ్రి ఆస్పత్రికి ఉదయం ఆరు గంటలకు తీసుకువెళ్లగా అప్పటికే విజయ్ చనిపోయాడని వైద్యులు తెలిపారు. తీవ్ర దుఃఖసాగరంలో మునిగి వారు వెళ్లిన అంబులెన్స్‌లోనే తిరుగుముఖం పట్టారు. ఈలోపు ఇంటి దగ్గర ఉన్న పెద్ద కుమారుడు రామకృష్ణకు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఉదయం 6:30 గంటల సమయంలో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఏలూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈలోపు రాజమండ్రి నుంచి అంబులెన్స్‌లో విజయ్ మృతదేహంతో వచ్చిన పెద్దనాన్న శ్రీనుకు విషయం తెలిసి విజయ్ మృతదేహాన్ని తండ్రి రవికి అప్పజెప్పి మరలా మరో అంబులెన్స్‌లో రామకృష్ణను నర్సు, కుటుంబ సభ్యులతో కలసి ఏలూరుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోని కామవరపుకోట వద్ద రామకృష్ణ మృతి చెందడంతో వెనుదిరిగి వచ్చారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ధనుంజయుడు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తల్లిదండ్రులు చెబుతున్నట్టు పానీపూరి తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయి ఇద్దరు మృతి చెందారా లేదా నేలపై పడుకోవడం వల్ల ఏదైనా విషపురుగు కాటుకు మృతి చెందారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి ఇంట్లో తిన్న అన్నాన్ని సీజ్ చేసి ల్యాబ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

అప్పుడు ఒకడు..ఇప్పుడు ఇద్దరు

వాస్తవానికి బెయల్‌పాటి రవి, చిన్నజమ్మక్కలకు మొత్తం ముగ్గురు మగ సంతానం. మొదటి కుమారుడు రామకృష్ణ, రెండో వాడు మంగరాజు, మూడోవాడు విజయ్. మూడేళ్ల క్రితం తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతూ మంగరాజు మృతి చెందాడు. ఇప్పుడు మిగిలిన ఇద్దరు కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన చూపరులకు కన్నీరు తెప్పిస్తోంది.

నా చేతుల్లోనే ప్రాణాలు వదిలారు..

'గుడారాల్లో ఉంటూ ఊరూరు వెళ్లి నీలి మందు, ప్లాస్టిక్ గిన్నెలు అమ్ముకుంటేనే జీవనం సాగని ఆ నిరుపేద కుటుంబాలు మావి. దేవుడు మాకు తీరని అన్యాయం చేశాడు. రెండు అంబులెన్స్‌లకు రూ.తొమ్మిది వేలు చెల్లించాల్సి వచ్చింది. అయినా మా బిడ్డల ప్రాణాలు దక్కలేదు. నా తమ్ముడి ఇద్దరు పిల్లలు నా చేతుల్లోనే ప్రాణాలు వదిలారు .. అంటూ మృతుల పెదనాన్న శ్రీను కన్నీటి పర్యంతమయ్యాడు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మొగల్తూరు, జనవరి 25: జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటకు చెందిన జోగి క్రాంతి(18) బైక్‌పై మొగల్తూరు వస్తుండగా సీతారామపురం స్వర్ణాంధ్ర కళాశాలకు వెళ్లే మలుపు సమీపంలో మొగల్తూరు వైపు వస్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ వెనుక చక్రాల కింద పడడంతో తలకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మురళీకృష్ణ నరసాపురం ఆర్టీసీ గ్యారేజ్‌లో మెకానిక్ పనులు చేస్తుంటాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబం, కుక్కలవారితోట గ్రామం విషాదంలో మునిగింది. ఈ ఘటనపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఇంటికి వచ్చిన యువకుడి దుర్మరణం

యలమంచిలి, జనవరి 25: సంక్రాంతి పండుగకు బంధువుల ఇంటికి వచ్చి అందరితో సరదాగా గడిపిన అండమాన్‌కు చెందిన యువకుడు ఆకుమర్తి సోను(29) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. అండమాన్‌లోని ఫరూర్ గండి మండలంలోని బొబుప్లాట్‌కు చెందిన ఆకుమర్తి సోను ఇరవై రోజుల క్రితం మండలంలోని ఇలపకుర్రు గ్రామంలోని కుమ్మరిపాలెం ప్రాంతంలోని మేనమామ సిర్రా శ్రీనివాస్ ఇంటికి సంక్రాంతి పండుగకు వచ్చాడు. బంధువులందరితోనూ సరదాగా గడిపిన సోను బుధవారం సాయంత్రం కుమ్మరిపాలెం నుంచి పాలకొల్లు బైక్‌పై వెళుతుండగా కట్టుపాలెం వద్ద రోడ్డుపై కుక్కలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. యువకుడి మేనమామ సిర్రా శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కుమ్మరిపాలెం ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు నమోదు

యలమంచిలి, జనవరి 25: యలమంచిలి మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికపై అదేగ్రామానికి చెందిన బాలుడు అత్యాచారానికి పాల్పడడంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.శివన్నారాయణ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. గత కొంతకాలంగా బాలుడు ఆ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని పెళ్లి చేసుకోమని అడగ్గా నిరాకరించాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బాలుడి తల్లిదండ్రులు, బంధువుల వద్దకు వెళ్లి అమ్మాయిని పెళ్లిచేసుకోమని అడుగగా ఆ బాలుడి బంధువులు బాలికను తీవ్ర పదజాలంతో దూషించారు. ఈ మేరకు బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాళ్ళ, జనవరి 25: సీసలి పంటకాల్వలో గుర్తు తెలియని పురుషుడు మృతుదేహం లభ్యమైనట్టు పోలీసులు గురువారం తెలిపారు. సీసలి పంట కాల్వలో మృతదేహం కొట్టుకొచ్చినట్టు వీఆర్వో జి.చిట్టిబాబు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు. మృతుదేహం బాగా కుళ్లి పాడైపోయిన స్థితిలో ఉందని, సుమారు 55 ఏళ్లు పైబడి వయసు ఉంటుందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుమారుడు అదృశ్యం.. తల్లి ఫిర్యాదు

ఆకివీడు, జనవరి 25: కుమారుడు కనపడడం లేదని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. అజ్జమూరుగరువుకు చెందిన మతిస్థిమితంలేని నల్లపు దిలీప్(29) ఈనెల 22 నుంచి కనుబడుటలేదు. గాలింపు అనంతరం గురువారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటి ప్రహరీని ఢీకొన్న స్కూల్ బస్

- 28 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు..



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

పెదపాడు, జనవరి 25 : వసంతవాడ గ్రామంలో స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఇంటి ప్రహరీని ఢీకొనగా బస్సులో వున్న స్కూల్ విద్యార్థులు చిన్నపాటి గాయాల తో క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. హనుమాన్‌జంక్షన్ ప్రాంతానికి చెందిన సిద్ధార్థ విద్యాలయ స్కూల్ బస్సు 28 మంది విద్యార్థుల తో వెళుతుండగా వసంతవాడ గ్రామంలోని ఓ మలుపు వద్ద అదుపు తప్పి పక్కనేవున్న ఇంటి ప్రహరీని ఢీకొంది. బస్సు ముందు భాగం, ఇంటి పైకప్పు, ప్రహరీ దెబ్బతినగా, బస్సులోని పలువురు విద్యార్థులకు స్వలంగా గాయాలయ్యాయి. తల్లిదండ్రులకు వారిని ఇళ్లకు తీసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనపై పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

రోడ్డుపై తిరగబడిన ట్రాక్టరు ట్రక్కు

- త్రుటిలో తప్పిన ప్రమాదం


ట్రాక్టర్ నుంచి ఊడి తిరగబడిన ట్రక్కు

బుట్టాయగూడెం, జనవరి 25 : ర్యాష్ డ్రైవింగ్ కారణంగా చిప్స్ లోడుతో వెళుతున్న ట్రాక్టరు ఇంజన్ నుంచి వేరుపడి ట్రక్కు రోడ్డుపై గురువారం తిరగబడింది. బుట్టాయగూడెంకు చెందిన ట్రాక్టరు చిప్స్ లోడుతో వేగంగా వస్తూ కొమ్ముగూడెం సెంటరులో మలుపు వద్ద ఇంజన్ నుంచి వేరుపడి ట్రక్కు రోడ్డుపైనే తిరగబడింది. దగ్గరలో ఉన్న షాపుల వద్దకు ఇంజన్ దూసుకుపోయింది. ఉదయం సమయం కావడంతో జనాల రద్దీ అంతగా లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్టయింది. ఇటీవలే హైస్కూల్ సెంటరు నుంచి కృష్ణాపురం వరకు డబుల్ రోడ్డును వేయడంతో వాహనాల వేగానికి అంతులేకుండా పోతుంది. లైసెన్స్ లేని వారిచేత ట్రాక్టర్లను నడిపించడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతునట్టు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.లక్ష విలువైన తెలంగాణ మద్యం స్వాధీనం

- పోలీసుల అదుపులో నిందితుడు


పోలీసులు స్వాధీనం చేసుకున్న తెలంగాణ మద్యం

వేలేరుపాడు, జనవరి 25 : తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తరలించి అధిక ధరలకు ఓ వ్యక్తి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. సుమారు రూ. లక్ష విలువైన తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని కటుకూరుకు చెందిన ముత్తుబోయిన రాంబాబు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో గల ఒక మద్యం దుకాణం నుంచి పెద్దఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి తన స్వగ్రామం కటుకూరుకు తరలించి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో దాడి చేశారు. రూ.99,440 విలువైన పలు కంపెనీలకు చెందిన 264 మద్యం సీసాలు, 371 బీర్ సీసాలను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

శ్రీవారికి ఏపీ లోకాయుక్త జడ్జి పూజలు


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న జస్టిస్ లక్ష్మణరెడ్డి

ద్వారకాతిరుమల, జనవరి 25: చినవెంకన్న ఆలయాన్ని ఏపీ లోకాయుక్త జడ్జి జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి గురువారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో త్రినాథరావు ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

బాబోయ్ పెద్ద పులి ?

- నల్లజర్ల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు సమాచారం
- చీపురుగూడెం ఫారెస్ట్‌లో ఉన్నట్టు అధికారుల అంచనా
- నేడు ఉన్నతాధికారుల రాక


చీపురుగూడెం వద్ద కెమెరాకు చిక్కిన పులి

నల్లజర్ల, జనవరి 25 : ఉభయగోదావరి జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం నల్లజర్ల మండలం పుల్లలపాడు, చీపురుగూడెం గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్టు సమాచారం. నల్లజర్లకు చెందిన వ్యాన్ డ్రైవర్ ప్రసాద్ బుధవారం రాత్రి ఒంటి గంటకు ఏలూరు నుంచి వస్తున్నాడు. పుల్లలపాడు వీరమ్మచెరువు వద్దకు వచ్చేసరికి బైపాస్ దాటి నిమ్మకాయల మార్కెట్ వైపునకు వెళ్లడంతో భయంతో వ్యాన్ డ్రైవర్ 100కు ఫోన్ చేశాడు. అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు గురువారం ఉదయం ఆ మార్గాన్ని పరిశీలించారు. పులి జాడలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలిపారు. నిమ్మకాయల మార్కెట్ నుంచి జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న తడికలకుంట చెరువులో నీరు తాగిన ఆనవాళ్లు ఉన్నాయి. అదేమార్గం మీదుగా చీపురుగూడెం ఫారెస్ట్‌లో జీడిమామిడితోటలో సంచరిస్తున్నట్టు గుర్తించిన ఫారెస్ట్ గార్డ్ శ్రీనివాస్ చీపురుగూడెం, నల్లజర్ల,పుల్లలపాడు గ్రామస్థులను ఆటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని హెచ్చరించారు.

పెద్దపులి జాడలు వాస్తవమే.. శ్రీనివాస్, ఫారెస్ట్‌గార్డ్

వీరమ్మ చెరువు, పుల్లపాడు నిమ్మకాయల మార్కెట్, తడికలకుంట ప్రాంతాల్లో గురువారం ఉదయం పరిశీలించాం. పులి అడుగుల జాడ స్పష్టంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బోనులు ఏర్పాటు చేసి పెద్ద పులికి పట్టుకునే ప్రయత్నం చేస్తాం.

పులి సంచార ప్రాంతాల్లో సబ్ డీఎఫ్‌వో పరిశీలన


పులి ఆవును చంపిన ప్రదేశాలను పరిశీలిస్తున్న సబ్ డిఎఫ్‌వో వెంకటసుబ్బయ్య

బుట్టాయగూడెం : మరోవైపు పశ్చిమ మన్యం ప్రాంతంలో పెద్దపులి సంచరించిన ప్రదేశాలను జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వి.వెంకటసుబ్బయ్య గురువారం పరిశీలించారు. బుట్టాయగూడెం మండలం చింత మొక్కబాట, అడ్డమడుగులలో ఆవును చంపిన తదితర ప్రదేశాలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. పులి సంచారం తెలుసుకోడానికి తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించి సూచనలు చేశారు.

12 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, జనవరి 25 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న ఎస్ఐలలో సీనియారిటీని బట్టి 12 మందికి సీఐలుగా పదోన్నతులు కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. పదోన్నతి పొందిన వారిలో వి.వెంకటేశ్వరరావు(తూర్పుగోదావరి జిల్లా), జి.కాశీ చరణ్ (కోస్టల్ సెక్యూరిటీ పోలీస్), గోవాడ వెంకటేశ్వరరావు (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ), నామాల మురళీకృష్ణ (తూర్పు గోదావరి), సీహెచ్ గోపాలకృష్ణ(కాకినాడ), వాసిరెడ్డి శ్రీను (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), బొర్రా నరసింహమూర్తి (తూర్పుగోదావరి), బీర సత్యనారాయణ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), లోకవరపు గౌరీనాయుడు (సీఐడీ), జిల్లెళ్ళ జేమ్స్‌రత్నప్రసాద్ (సీఐడీ), ఏలేటి చిట్టిబాబు (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ), చలమూరి ప్రకాష్ (ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ) ఉన్నారు. వీరికి ఒకటి రెండు రోజుల్లో పోస్టింగులు కల్పించనున్నారు.

ఆరుగురు ఎస్ఐలు, ఇద్దరు సీఐల బదిలీ..

ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు ఎస్ఐలు, ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్ఐ తలారి రామకృష్ణను కైకలూరు రూరల్ ఎస్ఐ గాను, జంగారెడ్డిగూడెం ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డిని నూజివీడు రూరల్ ఎస్ఐగా నియమించారు. ఎస్ఐ జి.జ్యోతిబసును జంగారెడ్డిగూడెం ఎస్ఐగా, లక్కవరం ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావును ఏలూరు వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో వున్న ఎస్ఐ టి.సుధీర్‌ను లక్కవరం ఎస్ఐగా నియమించారు. ఎస్ఐ పి.వాసును ముసునూరు ఎస్ఐగా నియమించారు. ఏలూరు వీఆర్‌లో ఉన్న సీఐ ఎం.సుధాకర్‌ను చింతలపూడి సీఐగా, జి.దుర్గాప్రసాద్‌ను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

'పశ్చిమ' నుంచి నలుగురు సీఐల బదిలీ

భీమవరంక్రైం, జనవరి 25 : పశ్చిమ గోదావరి జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేశామని జిల్లా ఎస్పీ రవిప్రకాశ్ తెలిపారు. ఏలూరురేంజ్ వీఆర్‌లో ఉన్న కె.మంగాదేవిని పాలకొల్లు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీఐ రాంబాబును ఏలూరురేంజ్ వీఆర్‌కు పంపించారు. పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావును వెస్ట్ గోదావరి డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పనిచేసి వీఆర్‌లో ఉన్న ఎస్.రజనీకుమార్‌ను పెనుగొండ సీఐగా బదిలీ చేశారు.

ఏటిగట్టు పనులు ముదునూరికి ఏటీఎం

- నెలాఖరులోపు స్పందించకపోతే ఆందోళన : బండారు హెచ్చరిక


ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

నరసాపురం, జనవరి 25: నరసాపురం ఏటిగట్టు పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతుందని, ఈ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఏటీఎంలా వాడుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆరోపించారు. గురువారం ఏటిగట్టు పనుల్ని ఆయన పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. రూ.26 కోట్లతో చేపడుతున్న ఈ పనులకు ముదునూరి బినామీ, ఆయన ఒత్తిళ్ళ కారణంగానే ఇంతవరకు విజిలెన్స్ కూడా ఈ పనులపై కన్నెత్తి చూడలేదు, గట్టు కోతకు గురై 20 రోజులు గడిచినా.. ఇంతవరకు చర్యలు లేదు, కనీసం విచారణకు కూడా ఆదేశించలేదు, ఈపనులకు అంచనాలు పెంచి అయినకాడికి దోచుకునేందుకు ముదునూరి ప్రయత్నిస్తున్నారన్నారు. పనుల్లో అడుగడుగున నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చేందుకు ముదునూరి, అధికారులు ప్రయత్నించడం సిగ్గుచేటు. ఈనెలాఖరులోపు ప్రభుత్వం స్పందించాలి, గట్టు కోతకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి ఒకటి నుంచి గట్టుపైనే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పొన్నమండ నాగేశ్వరరావు, చిటికెల రామ్మోహన్, నడిపూడి కృష్ణ, సత్యనారాయరాజు, రేవు ప్రభుదాసు, రెడ్డెం శ్రీను, అడిదెల దానియేలు, కొట్టు పండు, గన్నవరపు శ్రీను, బుల్లెట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి'


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 25 : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో చదువుతున్న బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఎంబీఏ కోర్సుపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. విశాఖపట్నంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) ఏపీ నిట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు క్యాట్ పరీక్ష రాయకుండానే ఎంబీఏ, డిప్లమో ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులలో చదువుకునే అవకాశం కల్పిస్తుందని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఐఎం ఆచార్యుడు షమీమ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ తోపాటు ఎంబీఏ చదివిన విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే స్థాయికి విద్యార్థులు ఎదగాలన్నారు. డీన్‌లు డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, డాక్టర్ కురుమయ్య, ఆచార్యులు డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ లావణ్యవేణి, డీఈవో తదితరులు

బాల్య వివాహాలను అరికడదాం

ఏలూరు కలెక్టరేట్, జనవరి 25: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. గిరిజన భవన్‌లో బేటీ బచావో - బేటీ పడావో ఆడపిల్లలను బతికిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం వర్క్‌షాపును ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ సామాజిక భద్రత, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు ఏర్పాటుచేసిన బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఈవో శ్యామ్‌సుందర్, బాలల సంరక్షణ అధికారి సీహెచ్.సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 25: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలను బతకనిద్దాం - బాలికలను చదివిద్దాం నినాదంతో కలెక్టరేట్‌లో, నూజివీడు డివిజన్ విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతి కేటగిరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున చెక్కులను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అందజేశారు. చిత్రలేఖనం విజేతలకు చెక్కులను అందజేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ఠ, డీసీపీవో సూర్యచక్రవేణి, పీఈఎంవో డి.నాగరత్నం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 25: విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ, రీసర్వే మూడోదశ, అసైన్డ్ భూములు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, జలజీవన్ మిషన్, ఆరోగ్య సురక్ష, ఎన్నికల సన్నద్ధతపై సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. కలెక్టరేట్ ఛాంబర్‌నుంచి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్, జేసీ లావణ్యవేణి, జిల్లా అధికారులు, డీఆర్‌ఏ ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై న్యాయవాదుల నిరసన


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

జంగారెడ్డిగూడెం, జనవరి 25 : ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను నిరసిస్తూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్‌లో యాక్ట్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏవీవీ.భువనేశ్వరి, పాశం సాయి ప్రతాప్, విత్తనాల రత్నరాజు, మానికల సూరిబాబు, టీఎస్ఎన్ మూర్తి, పీఎస్‌ఆర్‌కే లక్ష్మణరావు, వెంకట కృష్ణారెడ్డి, ముళ్ళపూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు సెర్ప్ ఉద్యోగుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 25: సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. జేఏసీ జిల్లా చైర్మన్ వి.బాపూజీ, కోకన్వీనర్ సీహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగం క్రమబద్ధీకరించి పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని, విధిలేక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సెర్ప్ ఉద్యోగులు అందర్నీ రెగ్యులర్ చేయాలని, తెలంగాణ మాదిరిగా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌ఏ మంజూరులో పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు భూములను పంపిణీ చేయాలి

దెందులూరు, జనవరి 25: భూస్వాములు, అగ్రవర్ణాల చేతు ల్లో ఉన్న పేదల భూములను పేదలకే పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. దోసపాడులో చేపల చెరువుల భూములపై వివాదం నేపథ్యంలో పేద దళితులు తమ భూములను స్వాధీనం చేసుకుంటామని గురువారం ఆందోళన నిర్వహించారు. భూవివాదం కోర్టులో ఉండడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. దోసపాడు గ్రామస్తులతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు

విచ్చలవిడి మద్యంతో నష్టపోతున్నాం


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కొయ్యలగూడెం, జనవరి 25: ఏరులై పారుతున్న మద్యాన్ని అరికట్టాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి యామిని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో అద్దయ్యకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే మద్యపానం నిషేధిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ మాట మరిచారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగానే మద్యాన్ని ఏర్పాటు చేసుకోవడం దారుణమన్నారు. మద్యం ప్రవాహంతో ఎన్నోకుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించాలని కోరారు. మహిళలు లక్ష్మి, షేక్ సైదాని, విశాలక్షి, సుజాత, తదితరులు ఉన్నారు.

రూ.71.59 లక్షల మిగులు బడ్జెట్

జంగారెడ్డిగూడెం, జనవరి 25 : మున్సిపల్ బడ్జెట్ రూ.71.59 లక్షల మిగులు బడ్జెట్‌తో కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. మొత్తం ఆదాయం రూ.21,02,56,726 కాగా, మొత్తం ఖర్చు రూ.20,30,97,750 చూపించారు. మొత్తం మిగులు రూ.71,58,796గా తేల్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్లు, కమిషనర్ పి.భవానీప్రసాద్, మేనేజర్ కేవీ రమణ, ఏఈ సంధ్య, అధికారులు పాల్గొన్నారు.


చింతలపూడిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు


టి.నరసాపురంలో సీనియర్ సిటిజన్లకు సత్కారం


కె.కోట మండలంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు


పోలవరంలో సీనియర్ సిటిజన్లకు సత్కారం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు

వజ్రాయుధం

జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు

పెదవేగి, జనవరి 25: దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని, ప్రతి ఓటరు విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ) ప్రిన్సిపాల్ వైఎస్ఎస్.చంద్రశేఖర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం జేఎన్వీలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఓటు విలువ, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థినులు రంగవల్లుల ద్వారా అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, జేఎన్వీ వైస్ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, వీఆర్వో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- లింగపాలెం: మండలంలో తహసీల్దార్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డి జేఎం రత్నకుమార్, బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ జేవీ.సుబ్బారావు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. విద్యార్థులు ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈవోపీఆర్డీ రాంప్రసాద్, హెచ్ఎం బీఎల్.స్వామి, పుట్టాల నాగేశ్వరరావు, ఆర్‌వీజీ.కృష్ణారావు, కె.కుటుంబరావు, శ్యామ్‌ప్రకాశ్, వీరాస్వామి, దుర్గారావు పాల్గొన్నారు.
- చింతలపూడి: అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి సూచించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న 18 ఏళ్ల వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, చింతలపూడి మునిసిపల్ కమిషనర్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.
- కామవరపుకోట: కె.ఎస్.రామవరం పాఠశాల వద్ద గ్రామ కార్యదర్శి నేతల విజయ్, వీఆర్వో లక్ష్మీనారాయణ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వారిని సత్కరించారు. తడికలపూడి, ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం, రామన్నపాలెం, తూర్పు యడవల్లి, రావికంపాడు, గుంటుపల్లి గ్రామాల్లో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు.
- పెదపాడు: దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువ ఓటర్లతో సమావేశమయ్యారు. తపన చౌదరి మాట్లాడుతూ ఓటు హక్కు ద్వారా భవిష్యత్‌ను నిర్ణయించుకునే సదవకాశాన్ని యువ ఓటర్లు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాని మోదీ వర్చువల్ విధానం ద్వారా చేసిన ప్రసంగాన్ని ఎల్ఈడీ స్ర్కీన్‌పై విద్యార్థులతో కలసి వీక్షించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అడబాక నాగసురేష్, ఎన్ఎస్ఎస్ అధికారి కుమార్, కాలేజ్ డీన్ సుబ్రహ్మణ్య శర్మ, ప్రసూన, రఘు, తదితరులు పాల్గొన్నారు. అప్పనవీడు హైస్కూల్‌లో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం 75 అడుగుల జాతీయ పతకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్.ఎం. తోట పుష్పావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపాడులోని పలువురు సీనియర్ ఓటర్లను సర్పంచ్ మరీదు రెడ్డియ్య సత్కరించారు. తొలుత ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్ర మంలో గంగాధర్, వీఆర్వో అజయ్ తదితరులు పాల్గొన్నారు.

- పోలవరం: ఓటు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని తహసీల్దారు బి.సుమతి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఆర్డీవో అద్దయ్య, సర్పంచ్ పొడుం పుష్ప సీనియర్ సిటిజన్లను సత్కరించారు. నూతన ఓటర్లకు ఓటరు ఐడి కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఓటు ఆవశ్యకతపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- భీమడోలు: మండలంలో భీమడోలు 86వ పోలింగ్ కేంద్రం వద్ద సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. 95వ నెంబర్ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న దివ్యాంగ ఓటరును తహసీల్దార్ ఇందిరాదేవి సత్కరించారు. ఓటు ఆవశ్యకతను వివరించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. జెఎంఎం పురంలో ఉపాధ్యాయులు మండే సుధాకర్ విద్యార్థులకు ఓటు హక్కు వినియోగాన్ని వివరించారు. సీనియర్ ఓటర్ వీరవాసరపు మహాలక్ష్మిని దుశ్శాలువాతో సత్కరించారు. ఓటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు: జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో నందిపాటి ప్రేమాన్విత ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లతో కలసి ఓటు హక్కు విలువపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డీటీ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్, పోతురాజు, ఆర్ఐలు సాయి రమేష్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.


పెదవేగి మండలంలో సీనియర్ ఓటర్‌కు సత్కారం



లింగపాలెం మండలంలో అవగాహన ర్యాలీ


భీమడోలులో ఓటర్‌కు సత్కారం



ఉంగుటూరు ఎంపిడివో కార్యాలయ వద్ద ఓటరు దినోత్సవ ర్యాలీ

ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన టిక్కెట్లు ఇవ్వండి


అచ్చెన్నాయుడికి వినతిపత్రం ఇస్తున్న అంబికా కృష్ణ

ఏలూరు టుటౌన్, జనవరి 25: రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను కేటాయించాలని ఆర్యవైశ్య జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబికా కృష్ణ అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని విజయవాడలో గురువారం కలసి ఎన్నికల్లో పోటీచేసే ఆర్యవైశ్యుల జాబితాను అందజేశారు. చంద్రబాబుతో మాట్లాడి ఆర్యవైశ్యులకు తగినన్ని టికెట్లు వచ్చే విధంగా కృషి చేస్తానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినట్లు అంబికా కృష్ణ తెలిపారు.

గండికోట రాజేష్‌కు ఆలపాటి పురస్కారం

ఏలూరు కల్చరల్, జనవరి 25: అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు జయంతి ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలపాటి రామచంద్రరావు కళాపీఠం ఆధ్వర్యంలో ఇచ్చే కళా పురస్కారం ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు గండికోట రాజేష్‌కు అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా అందజేశారు. కళారత్న కేవీ.సత్యనారాయణ మాట్లాడుతూ కళారంగానికి ఆలపాటి రామచంద్రరావు విశేష సేవలందించారని కొనియాడారు. తండ్రి స్ఫూర్తితో అంబికా సోదరులు ఏటా పురస్కారాన్ని అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. తొలుత ఆలపాటి రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్రాంతికి ఆర్టీసీకి అదనపు ఆదాయం

ఏలూరు రూరల్, జనవరి 25: జిల్లాలో సంక్రాంతికి ఆర్టీసీ సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించిందని, 14రోజులకు రూ.1.2 కోట్ల అదనపు ఆదాయం సమకూరిందని ప్రజా రవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఆర్ఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి సంక్రాంతికి దాదాపు 14రోజులు ప్రత్యేక బస్సులను నడిపినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.70 లక్షలు అదనపు ఆదాయం వచ్చిందన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రోజూ డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా, డిపో స్థాయిలో ఉత్తమ డ్రైవర్లకు వచ్చే నెలలో ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన తెలిపారు.

పోలీసు నిర్బంధాలపై యూటీఎఫ్ నిరసన

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 25: మున్సిపల్ టీచర్ల సమస్యలపై విజయవాడలో మహాధర్నాకు హాజరుకాకుండా యూటీఎఫ్ నాయకులను పోలీసులు నిర్బంధించడంపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సంఘ నాయకులు, టీచర్లు నిరసన ప్రదర్శన జరిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫా అలీ, రవికుమార్ పోలీసు చర్యలను ఖండించారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఎంతకాలం ఆపుతారని ప్రశ్నించారు. శివశంకరరావు, పీవీ నరసింహారావు, కనకదుర్గ, సుభాషిణి, సుదారాణి, రాంబాబు, రంగమోహన్, రాజారావు, మోహన్‌రావు, వెంకటరమణ, అప్పారావు, పర్వీన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ సంగ్రామ దీక్షకు షర్మిలకు ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 25 : 'ఓట్ ఫర్ ఓపీఎస్' డిమాండ్‌తో ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న సాగర్ సంగ్రామ దీక్ష ర్యాలీకి రావాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను సంఘ నాయకులు గురువారం ఆహ్వానించారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రామారావు తెలియజేశారు. రాష్ట్రంలో ఓపీఎస్‌కోసం తాము చేస్తున్న పోరాటానికి మద్దతునివ్వాల్సిందిగా కోరామన్నారు. సాగర్ ర్యాలీకి హాజరై ఓపీఎస్‌పై కాంగ్రెస్ పార్టీ విధానాన్ని బహిరంగంగా ప్రకటించాలని అభ్యర్థించామని వివరించారు. షర్మిలను కలిసిన సంఘ నాయకుల్లో స్టేట్ కౌన్సిలర్ నాగదుర్గారావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ ఉన్నారు.

న్యాయంపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తపనా చౌదరి

పెదవేగి, జనవరి 25: న్యాయంపల్లిలో తపన ఫౌండేషన్ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి), రేణుక దంపతులు గురువారం ప్రారంభించారు. గ్రామంలో రక్షిత తాగునీరు లేదని గ్రామస్తుల అభ్యర్థన మేరకు తపన చౌదరి రూ.2 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా గ్రామీణ ప్రాంతాల్లో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో 20పైగా గ్రామాల్లో వాటర్ ట్యాంకర్లను అందించామని ఆయన చెప్పారు. ఉండవల్లి వెంకట్రావు, పొన్నూరు శంకర్‌గౌడ్, కొమ్మిన నాగేశ్వరరావు, సత్యనారాయణ, దావులూరి శ్రీనివాసరావు, దానం రమణ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో సత్యనారాయణస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లింగపాలెం, జనవరి 25: రంగాపురం సత్యదేవుని ఆలయంలో సత్యనారాయణస్వామి కల్యాణం గురువారం నిర్వహించారు. రంగాపురం సత్యదేవుని ఆలయంలో పుష్య మాసం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భూదేవి నీలాదేవి సహిత సత్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోతునూరులో సామూహిక సత్యనారాయణ వ్రతం

దెందులూరు: పోతునూరు రామలయంలో సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతం గురువారం నిర్వహించారు. పోతునూరు గ్రామానికి చెందిన చెజవాడ సత్యవరప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. 18 మంది జంటలు, గ్రామస్తులు పాల్గొన్నారు,

ఆయిల్‌పామ్‌కు గిట్టుబాటు ధర కల్పించాలి

ద్వారకాతిరుమల, జనవరి 25: ఆయిల్‌పామ్‌కు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎం.నాగులపల్లిలో గురువారం సంఘ నేతలు పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పామాయిల్ రైతులు నష్టపోతున్నారన్నారు. గత ఏడాది టన్ను గెలల ధర రూ. 23 వేలు ఉంటే ప్రస్తుతం రూ.12,400కు చేరిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా కనీసం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, బి.సత్యనారాయణ, టి.మురళి, కృష్ణ, గాంధీ, సుందరరావు తదితరులున్నారు.

ఎస్జీటీల పదోన్నతులకు సీనియారిటీ జాబితా

బుట్టాయగూడెం, జనవరి 25: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీచేయడానికి ఎస్జీటీల తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు ఐటీడీఏ డీడీ పీవీఎస్ నాయుడు తెలిపారు. అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో జాబితా ఉంచామని, తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31లోపు రాతపూర్వంగా తెలియజేయాలన్నారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం జరగదన్నారు. సరైన ఆధారాలు చూపని అభ్యంతరాలను తిరస్కరిస్తామన్నారు.

శ్రీవారికి హోంమంత్రి వనిత పూజలు


ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న వనిత

ద్వారకాతిరుమల, జనవరి 25: వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని హోం మంత్రి తానేటి వనిత గురువారం సందర్శించారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ఈవో త్రినాధరావు ఆమెకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

చిన్న సమస్యలను సరి చేసుకోవాలి

ద్వారకా తిరుమల, జనవరి 25: నియోజకవర్గ స్థాయిలో చిన్న సమస్యలుంటే సరిచేసుకుని పార్టీ విజయానికి బాటలు వేయాలని ఉభయగోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ద్వారకాతిరుమలలో గోపాలపురం నియోజకవర్గస్థాయి సమావేశం, ఇన్‌చార్జి తానేటి వనిత పరిచయ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సమీకరణల్లో భాగంగా హోంమంత్రి వనితను ఇక్కడ, తలారి వెంకట్రావును కొవ్వూరుకు పంపించారన్నారు. మంత్రి వనిత మాట్లాడుతూ ఈ నియోజకవర్గ ఆడబడుచునేనని తనను ప్రతీఒక్కరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు, చెలికాని రాజబాబు, జంగా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తెర వెనుక ఉండేది నేనే : ఎంపీ కోటగిరి

చింతలపూడి, జనవరి 25: ఎన్ని విభేదాలువచ్చినా అందరం వైసిపీ కుటుంబమే, ఎన్నికల్లో తాను పోటీ చేయడంలేదని, పోటీ చేయబోతున్న అభ్యర్థుల తెర వెనుక తానే ఉంటానని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. స్థానిక విజెఎం ఫంక్షన్ హాలులో వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిచయ వేదిక గురువారం నిర్వహించారు. ఏలూరు పార్లమెంటు ఇన్‌చార్జిగా నియమితులైన కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. చింతలపూడి వైసీపీ ఇన్‌చార్జి విజయరాజు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కోటగిరి శ్రీధర్ సహకారంతో పూర్తి చేయాలనేది తన లక్ష్యమన్నారు. చింతలపూడి, లింగపాలెం మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో నిందితులకు రిమాండ్

భీమడోలు, జనవరి 25 : డ్రైవింగ్ నేర్చుకోవడానికి వెళ్లిన మహిళపై దాడి చేసిన ఇద్దరికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు భీమడోలు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 23న భీమడోలులో డ్రైవింగ్ నేర్చుకుంటున్న మహిళను మద్దా కల్యాణ్, నూకల ప్రవీణ్ బెదిరించి, కొట్టి డబ్బులు లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో వారిని అరెస్టు చేసి గురువారం కోర్టుకు తరలించారు. వారికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు

వస్త్ర వ్యాపారి చెలాకోటి వీరయ్య కన్నుమూత



ఏలూరు కల్చరల్, జనవరి 25: ప్రముఖ వస్త్ర వ్యాపారి, వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు చెలాకోటి వీరయ్య గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతికి వైఎంహెచ్ఏ పాలకవర్గం సంతాపాన్ని వ్యక్తం చేసింది. వీరయ్య ఎన్నో కళా సంస్థలు, కళాకారులకు సహాయ సహకారాలు అందించారని, ఆయన మృతి తీరని లోటన్నారు. వైసోమలింగేశ్వరరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూ టౌన్ :** ఏఎస్ఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రారంభించారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, బాపిరాజు పాల్గొన్నారు.
- **పెదపాడు :** చిన్న ఆశ్రమ తల్లి అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అమ్మవారి ఘటాలతో అమ్మవారి ఆలయానికి కాలినడకన తరలివెళ్లారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, తెల్లం రాజ్యలక్ష్మి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.
- **కుక్కునూరు :** వలంటీర్లకు జాబ్‌చార్ట్ విడుదల చేసి వేతనాలు పెంచాలని సీఐటీయు మండల కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. వలంటీర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** పట్టణంలో ఫుడ్ పాయిజన్‌తో మరణించిన చిన్నారుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఈ. భూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు.
- **కొయ్యలగూడెం :** బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ భారతరత్నకు ఎంపికపై నాయీబ్రాహ్మణులు సంబరాలు చేశారు. ఆయన సిద్ధాంతాలను పాటించాలన్నారు. శివాజీగణేష్, వినోద్, చిన్నయ్య, మణికంఠ, అమ్మిరాజు, శ్రీను, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** విశ్వకర్మ పథకంలో అధికంగా లబ్ధి పొందేది ఓబీసీలేనని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. రావులపర్రులో ఓబీసీ సెల్ సమావేశం నిర్వహించారు. అయినం బాలకృష్ణ, కె.విజయ్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను అమలు చేయాలని టీవీఎస్.రాజు డిమాండ్ చేశారు. మక్కినవారిగూడెంలో కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. రాము, సతీష్, కె.శ్రీనివాసరావు, మల్లెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో బడేటి చంటికి మహిళల హారతి




జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల్లో భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు


చేబ్రోలులో క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న గన్ని

దగాకోరు వైసీపీ ప్రభుత్వాన్ని

వదిలించుకుందాం

జగన్ పాలనపై టీడీపీ నేతల ధ్వజం

ఏలూరు టూటౌన్, జనవరి 25: దగాకోరు వైసీపీ ప్రభుత్వాన్ని వదిలించుకుందామని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 28వ డివిజన్‌లో గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో వివరించారు. టీడీపీ జనసేన అధికారంలో రాగానే ఆడపడుచులకు 5 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం ద్వారా రూ. 15 వేలు, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, ఆడబిడ్డ నిధి రూ.1500 అమలు చేస్తామన్నారు. రైతుకు ఏడాదికి రూ.20వేలు అందిస్తామన్నారు. వైసీపీ ఓటమి ఖాయమని తేలడంతో జగన్ తీవ్ర నైరాశ్యంతో మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, డివిజన్ ఇన్‌చార్జి అరుణ సురేష్, మనోహర్, చంద్రశేఖర్, రామారావు, ఎం.ఉమా, తదితరులు పాల్గొన్నారు.

- జంగారెడ్డిగూడెం: రానున్నది చంద్రన్న ప్రభుత్వమేనని టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అన్నారు. మండలంలోని లక్కవరంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంట అందిస్తామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు. గద్దె వెంకట సుబ్బారావు, కొట్టారి ప్రసాద్, కంభపు రామిరెడ్డి, బలుసు కిరణ్‌కుమార్, పరచిన నాగిరెడ్డి, ఉండవల్లి రవిశంకర్, దల్లి గురునాథ్‌రెడ్డి, నందమూరి రాజేష్, పసల వెంకటరాజు, చుక్కా సూర్య ప్రకాష్, మురళి, నాయని రామారావు తదితరులు పాల్గొన్నారు.
- కామవరపుకోట: టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో తడికలపూడి శివాలయం కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన నాయకులు సంయుక్తంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాలను వివరించారు. తూతా లక్ష్మణరావు, బొంతు వెంకటేశ్వరరావు, మేరుగు సుందరరావు, సిరిగిబత్తుల నాగరాజు, పెనుమాల కిరణ్, యర్రోజు శివాజీ, మొట్టికాయల నాగయ్య, వెర్రు ధర్మ లింగేశ్వరరావు, ఏనుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం: టీడీపీ, జనసేన సంయుక్తంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాయని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్ట రామారావు అన్నారు. మర్రిగూడెం పరిధిలోని సుందరరావుపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జనసేన జిల్లా కార్యదర్శి తుట్టి రామచంద్రరావుతో కలసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కుంజా లోకేష్, కుంజా వీరాస్వామి, తుట్టి చిన్ననాగేశ్వరరావు, కొరసా దొరబాబు, రవి, సున్నం వెంకటేశ్వరరావు, పొట్ట సూర్యచంద్రరావు, జనసేన గ్రామ యూత్ అధ్యక్షులు పూనెం ప్రకాష్, నారం బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్, బూత్ స్థాయి ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు: నియోజకవర్గంలోని బూత్ లెవెల్, క్లస్టర్ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. నియోజకవర్గంలోని ఇన్‌చార్జిలకు చేబ్రోలులో గురువారం శిక్షణ ఇచ్చారు. గన్ని మాట్లాడుతూ ప్రతి ఓటరును కలసి అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు సింగులూరి రామకృష్ణ, బొమ్మిడి అప్పారావు, సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

- దెందులూరు: టీడీపీ విజయానికి, చింతమనేని ప్రభాకర్‌ను భారీ మోజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కలసి పని చేద్దామని కొవ్వలి గ్రామ కమిటీ తీర్మానం చేసింది. గుత్తా రాజా అధ్యక్షతన బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వెలమాటి అశోకచక్రవర్తి, వడ్లపట్ల పండు, వెలమాటి అనిల్ కుమార్, కసూకుర్తి రామకృష్ణ, గద్దే అమరేశ్వరావు, ఇనుమూల హరికృష్ణ, పూట్టా రాజేష్, పప్పల సుశీల పాల్గొన్నారు.



మాక్ ఓటింగ్ పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్

ఓటు వజ్రాయుధం

» ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

నూజివీడు, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటుద్వారా తమ పాలకులను నిర్ణయించుకునే అధికారం ఓటర్లకు ఉందని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ డి.ఎస్. యల్లారావు, ఎలక్షన్ డీటీ సింగ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్‌రషీద్ పాల్గొన్నారు.



కలిదిండిలో ప్రతిజ్ఞ చేస్తున్న సీనియర్ ఓటర్లు, అధికారులు

● కలిదిండి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీనియర్ ఓటర్లను తహసీల్దార్ తహసీల్దార్ దశిక వంశీ సత్కరించారు. ఓటు విలువ తెలుసుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ విజయలక్ష్మి, బీఎల్‌వోలు గుడిపాటి శ్రీనివాస్, ప్రసాద్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో సీనియర్ ఓటర్లకు సన్మానం

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి

● చాట్రాయి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ నిర్వహించి, సీనియర్ ఓటర్లను సన్మానించారు. చనుబండ, పోలవరం, పోతనపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో బ్రహ్మాచారి, దామెర ఉష ప్రసాద్‌బాబు, చెలికాని బాబ్జీ, శివకుమారి, మోరంపూడి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, బీయల్వోలు, ఉపాధ్యాయులు, రెవెన్యూ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి

● ముసునూరు : ఓటు హక్కుతో ప్రజలు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని హెచ్ఎం పి.వి.ఎస్. రామకృష్ణ పేర్కొన్నారు. రమణక్కపేట జడ్పీ పాఠశాలలో విద్యార్థులచే ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించి, ఓటుయొక్క ప్రాముఖ్యతను వివరించారు. వాకా నాగరాజు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు. కాట్రేనిపాడు సచివాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు.



ముసునూరులో చిన్నారులతో ప్రతిజ్ఞ..

ఓటుహక్కు ఎంతో విలువైంది



కైకలూరు కళాశాలలో..

● కైకలూరు : ఓటు హక్కు ఎంతో విలువైందని, యువత సక్రమంగా వినియోగించుకుని సమాజ అభివృద్ధికి దోహదపడే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాబ్జీ అన్నారు. ఉర్దూస్కూల్లో సీనియర్ ఓటరను సన్మానించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల్లో ఓటు హక్కు విలువ తెలిసేవిధంగా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. బహుమతులను అందజేశారు. 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ బి. మురళీకృష్ణ, ఎన్నికల డీటీ కిరణ్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్, కోమలి, వీఆర్వోలు, విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.పి. రంగారావు పాల్గొన్నారు.

వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రఘునాథ రెడ్డి వివరించారు. అధ్యాపకులు ఎం.హరిప్రసాద్, బి. వేదాంతం, నున్న శ్రీనివాసరావు, పంకజ్‌కుమార్, ఫణీంద్రరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేడర్ ఎం. విజయ కుమార్ పాల్గొన్నారు.

● ముదినేపల్లి : మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధ ఓటర్లను బీఎల్‌ఓలు సత్కరించారు. కొత్త ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, పెయ్యేరులో సర్పంచ్ అల్లు సుశీల, దాకరంలో జాస్తి బాబూ రాజేంద్రప్రసాద్ వృద్ధ ఓటర్లను సన్మానించారు. కొత్త ఓటర్లకు పోస్టల్ ద్వారా గుర్తింపు కార్డులు పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. శీలం రామకృష్ణ పాల్గొన్నారు.



ముదినేపల్లిలో..

సీతమ్మకు సారె..



కైకలూరు, జనవరి 25: అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని పది రోజులుగా శ్రీరామకృష్ణ సేవాసమితిలో సీతారాముల వారికి విశేషపూజలను నిర్వహించారు. సీతమ్మవారికి గురువారం మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. రామనామసంకీర్తనలు, హనుమాన్‌చాలీసా పారయాణాన్ని నిర్వహించారు. అయోధ్య నుంచి అక్షింతలు వచ్చినప్పటి నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సేవాసమితి అధ్యక్షులు భూపతిరాజు వెంకటేశ్వరవర్మ, సెక్రటరీ రాజేశ్వరరావు తెలిపారు. నీరజ, సేవా సమితిసభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా సువర్చల ఆంజనేయుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కైకలూరు, జనవరి 25: శ్యామలాంబ కళామండపం వద్ద సువర్చల సమేత ఆంజనేయస్వామి శాంతికల్యాణం గురువారం కనుల పండువగా జరిగింది. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ధర్మప్రచారంలో భాగంగా సువర్చల ఆంజ నేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా తీర్చిదిద్ది మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతు జరిపించారు. వందలాదిమంది భక్తులు కనులారా తిలకించారు. తొలుత శ్రీమన్నారాయణగోష్ఠి మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవో ఆకుల కొండలరావు, శ్యామలాంబ ఆలయ ఈవో వి.ఎన్.కె. శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించకారు. గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు, లోయా రంగారావు, తులసి పూర్ణ, బందా శేఖర్ పాల్గొన్నారు.

పానీపూరి తిని ఇద్దరు చిన్నారుల మృతి..!

» జంగారెడ్డిగూడెంలో తీవ్ర కడుపునొప్పితో అన్నదమ్ముళ్ల మృత్యువాత
» పొట్టకూటి కోసం వచ్చిన కుటుంబంలో తీవ్ర విషాదం
» అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు » అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



జంగారెడ్డిగూడెం, జనవరి 25 : పొట్టకూటి కోసం మైళ్ల దూరం వచ్చిన ఒక సంచార కుటుంబంలో విషాదం నెలకొంది. ముక్కుపచ్చలారని అన్నదమ్ముళ్లు ఇద్దరు గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. ఈ విషాద ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన ఆరు కుటుంబాలు ఉపాధి కోసం రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చి స్థానిక రామచంద్రపురం వాటర్ ట్యాంక్ దగ్గర గుడారాలు వేసుకుని ఉంటున్నారు. నీలి మందు, ప్లాస్టిక్ సామానులను సమీప గ్రామాలకు వెళ్లి విక్రయిస్తుంటారు. వీరంతా 2009 నుంచి 2016 వరకు జంగారెడ్డిగూడెంలోనే ఉండి ప్లాస్టిక్ సామానులు అమ్ముకుంటూ జీవనం సాగించారు. 2016లో ఇక్కడ నుంచి వారి సొంత గ్రామానికి వెళ్లి మరలా తిరిగి ఇక్కడకు రెండు నెలల క్రితమే వచ్చారు. ఈ ఆరు కుటుంబాల్లో ఒక కుటుంబం అయిన బెయల్‌పాటి రవి, చిన్నజమ్మక్కలకు రామకృష్ణ (11), విజయ్(6) ఇద్దరు సంతానం. రామకృష్ణ స్థానిక రామచంద్రపురం ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా చిన్నకుమారుడు విజయ్ ఇంటి వద్దే ఉంటున్నాడు.

గంటల వ్యవధిలో ఇద్దరూ..

బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా పట్టణంలోని ఒక పానీ పూరీ బండి వద్ద పానీపూరీ తిన్నారు. తిరిగి ఇంటికి వచ్చి చిక్కుడు కాయ కూరతో భోజనం చేసి తమ గుడారంలో నేలపై నిద్రించారు. అయితే వీరిలో గురువారం తెల్లవారు ఝామున 3 గంటలకు చిన్న కుమారుడు విజయ్ భరించలేని కడుపునొప్పి వస్తోందని ఏడవడంతో స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉందని రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. బాలుడు పెదనాన్న బెయిల్‌పాటి శ్రీను, కుటుంబ సభ్యులు విజయ్‌ను ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో రాజమండ్రి ఆస్పత్రికి ఉదయం 6 గంటలకు తీసుకువెళ్లగా అప్పటికే విజయ్ చనిపోయాడని వైద్యులు తెలిపారు. తీవ్ర దుఃఖసాగరంలో మునిగి వారు వెళ్లిన అంబులెన్స్‌లోనే తిరుగుముఖం పట్టారు. ఈలోపు ఇంటి దగ్గర ఉన్న పెద్ద కుమారుడు రామకృష్ణకు కూడా తీవ్రంగా కడుపునొప్పి రావడంతో ఉదయం 6:30 గంటల సమయంలో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఏలూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈలోపు రాజమండ్రి నుంచి అంబులెన్స్‌లో విజయ్ మృతదేహంతో వచ్చిన పెద్దనాన్న శ్రీనుకు విషయం తెలిసి విజయ్ మృతదేహాన్ని తండ్రి రవికి అప్పజెప్పి మరలా మరో అంబులెన్స్‌లో రామకృష్ణను నర్సు, కుటుంబ సభ్యులతో కలసి ఏలూరుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోని కామవరపుకోట వద్ద రామకృష్ణ మృతి చెందడంతో వెనుదిరిగి వచ్చారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ధనుంజయుడు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తల్లిదండ్రులు చెబుతున్నట్టు పానీపూరి తినడం వల్ల ఫుడ్‌పాయిజన్ అయి ఇద్దరు మృతి చెందారా లేదా నేలపై పడుకోవడం వల్ల ఏదైనా విషపురుగు కాటుకు మృతి చెందారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి ఇంట్లో తిన్న అన్నాన్ని సీజ్ చేసి ల్యాబ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.



ఆసుపత్రి వద్ద రోధిస్తున్న తల్లి, బంధువులు

మృతులు అన్నదమ్ములు రామకృష్ణ, విజయ్ (ఫైల్)

అప్పుడు ఒకడు..ఇప్పుడు ఇద్దరు

వాస్తవానికి బెయల్‌పాటి రవి, చిన్నజమ్మక్కలకు మొత్తం ముగ్గురు మగ సంతానం. మొదటి కుమారుడు రామకృష్ణ, రెండో వాడు మంగరాజు, మూడోవాడు విజయ్. మూడేళ్ల క్రితం తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతూ మంగరాజు మృతి చెందాడు. ఇప్పుడు మిగిలిన ఇద్దరు కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన చూపరులకు కన్నీరు తెప్పిస్తోంది.

నా చేతుల్లోనే ప్రాణాలు వదిలారు..

'గుడారాల్లో ఉంటూ ఊరూరు వెళ్లి నీలి మందు, ప్లాస్టిక్ గిన్నెలు అమ్ముకుంటేనే జీవనం సాగని ఆ నిరుపేద కుటుంబాలు మావి. దేవుడు మాకు తీరని అన్యాయం చేశాడు. రెండు అంబులెన్స్‌లకు రూ.తొమ్మిది వేలు చెల్లించాల్సి వచ్చింది. అయినా మా బిడ్డల ప్రాణాలు దక్కలేదు. నా తమ్ముడి ఇద్దరు పిల్లలు నా చేతుల్లోనే ప్రాణాలు వదిలారు .. అంటూ మృతుల పెదనాన్న శ్రీను కన్నీటి పర్యంతమయ్యాడు.





నూజివీడు మామిడిని చూపుతున్న ముద్దరబోయిన, మండవల్లిలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

బలహీన వర్గాలకు వైసీపీ వెన్నుపోటు

'జయహో బీసీ' విజయవంతం

నూజివీడు, జనవరి 25: బలహీన వర్గాలకు వైసీపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచి వారికి తీవ్ర ద్రోహం చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. యనమదల గ్రామంలో గురువారం నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 సంవత్సరాలుగా బీసీలకు అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించిన ఘనత జగన్‌దే అన్నారు. ఫలితంగా 16 వేల రాజ్యాంగబద్ధ పదవులను బీసీలు కోల్పోయారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విదేశీవిద్యను ప్రోత్సహిస్తూ ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షల చొప్పున రూ.150 కోట్లు అందించిందన్నారు. ఆదరణ పథకం కింద చేతివృత్తుల వారికి 90శాతం సబ్సిడీపై పరికరాలు అందించేందుకు రూ.1,130కోట్లు మంజూరు చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్‌ల ద్వారా రూ.3,700 కోట్లతో వ్యక్తిగత రుణాలు మంజూరుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చగా, జగన్ ప్రభుత్వం రూ.76,750 కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిందని విమర్శించారు. మండల అధ్యక్షులు ముసునూరు రాజా మాట్లాడుతూ, టీడీపీ హయాంలో ఎంతోమంది బీసీలు రాజకీయంగా ఎదిగి ఎన్నో పదవులు పొందారన్నారు. చిమటా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అట్లూరి రమేష్, కొనకళ్ళ నరసింహారావు, గోళ్ళ చిన్ని, లక్ష్మీకాంతమ్మ, దుప్పూరి వెంకయ్య, రామోజీ, దొప్పలపూడి సాంబశివరావు, మల్లిశెట్టి జగదీష్, యనమదల సత్యనారాయణ, ముదగన గిరిబాబు, నాగరాజు, శ్రీనివాసరావు, సంగీతరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

● ముసునూరు: బీసీ సెల్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరి నక్కా యోహాను, తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గారపాటి నరసింహారావు, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు, పాకనాటి సీతారామ్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీసీలు టీడీపీకి అండగా నిలవనున్నారనే విషయం జయహో బీసీ సభతో నిర్ధారణ అయిందన్నారు. మండల స్థాయిలో ముసునూరులో నిర్వహించిన జయహో బీసీ సభకు దాదాపు నాలుగువేల మంది బీసీలు హాజరవ్వడం చూస్తే బీసీలను వైసీపీ ఏ విధంగా వంచించిందో అర్థమవుతోందన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపడమే లక్ష్యం

● మండవల్లి : వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే బీసీల లక్ష్యమని పలువురు నేతలు పేర్కొన్నారు. లింగాలలో టీడీపీ కైకలూరు నియోజకవర్గ నేతల ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జై బీసీ, జయహో బీసీ అంటూ సింహంలా గర్జించ డానికి బీసీలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గాలకు పేరుకు మాత్రమే కార్పొరేషన్లు ఉన్నాయని వాటికి విధులు, నిధులు, గదులు లేవని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు సుమారు 34వేల కోట్లు దారిమళ్లించారని ఆరోపించారు. . సామాజిక సాధికారిత రావాలంటే జనసేన-టీడీపీ ప్రభుత్వం రావాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, వీరమల్లు నరసింహారావు, బి.విజయలక్ష్మీ, పెన్మెత్స వెంకటేశ్వరరాజు, వినోద్, నారగాని నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, తలారి రాజేష్, విజయ్‌కుమార్, బీవీ రావు, శ్రీనివాసచక్రవర్తి, అంగ్రాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో సాగుదారుల సదస్సు

చాట్రాయి, జనవరి 25: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పేదలు సాగు చేసుకుంటున్న అటవీ, ప్రభుత్వ భూముల మంజూరు అంశాలపై శుక్రవారం నూజివీడు అమర్‌భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు భద్రత లేని ఏపీ భూహక్కుల చట్టం రద్దుకు ప్రజలు అందరూ ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. చాట్రాయి మండలం చిత్తపూరు, కోటపాడు, మర్రిబంధం, చీపురుగూడెం, ముసునూరు మండలం రమణక్కపేట, బాసవరప్పాడు గ్రామాల్లో 70 ఏళ్ల నుంచి పేదలు సాగు చేసుకుంటున్న అటవీ, ప్రభుత్వ భూముల క్లాసిఫికేషన్ మార్చి పట్టాలు మంజూరు చేయాలని ఎంతో కాలం నుంచి పోరాటం చేస్తున్నా పాలకులు స్పందించకపోవటం అన్యాయమన్నారు. ఐర్లా జాతీయ కార్యదర్శి ఎస్ . అజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ హాజరవుతున్నారని చెప్పారు.

రైతు బజార్ ప్రారంభానికి సన్నాహాలు



మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ

కలిదిండి, జనవరి 25 : కలిదిండి రైతు బజార్‌ను త్వరలో ప్రారంభిస్తామని ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి సమావేశ జరిగింది. ఆయన మాట్లాడుతూ, రైతుబజార్‌ను పూర్తి చేయటానికి రూ.27 లక్షలు మంజూరయ్యాయని టెండర్ వేయటానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో జాప్యం జరిగిందన్నారు. ఫిబ్రవరిలో రైతు బజార్‌ను ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు వెంబడి షాపింగ్ కాంప్లెక్స్, వే బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబరు నుంచి డిసెంబర్ వరకు మార్కెట్ యార్డుకు రూ.కోటి 26 లక్షలు ఆదాయం రాగా, రూ.20 లక్షలు వ్యయమైందన్నారు. దూలం నాగేశ్వరరావు,బత్తిన కిషోర్, వరలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు అధ్యక్షులకు సన్మానం

ఆగిరిపల్లి, జనవరి 25: సమ్మె సక్సెస్‌ను పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో అంగన్‌వాడీలు ప్రాజెక్టు అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. అన్నమ్మ, పుల్లమ్మ, అనురాధ, ఈశ్వరమ్మ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాజకుమారి, రాజ్యలక్ష్మిని అభినందించారు. సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి జి.రాజు, ఆగిరిపల్లి మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్ , అయ్యప్ప పాల్గొన్నారు.

వికసిత్ సంకల్ప యాత్ర..

ముదినేపల్లి, జనవరి 25 :వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ముదినేపల్లిలో గురువారం అధికారులు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ, వైద్య ఆరోగ్య స్త్రీ శిశు సంక్షేమ శాఖల సిబ్బంది ఏర్పాటు చేసిన సేంద్రీయ ఎరువుల ఉత్పత్తులు, వైద్య పరికరాలు, మందులు, అంగన్‌వాడీల్లో తయారు చేసే వంటల ప్రదర్శనలను సంకల్పయాత్ర అధికారుల బృందం పరిశీలించింది. కేంద్రం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మండల పరిషత్ పరిపాలన అధికారి రమణబాబు తెలిపారు. డాక్టర్ శాంతి శ్రీ, వేణుమాధవ్, జాన్సీ, శ్రీనివాసరావు, సునీత, ఎంవి.సుబ్బారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండవల్లి, జనవరి 25: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలివి. దయ్యంపాడు గ్రామానికి చెందిన కంభంపాటి బెంజిమెన్ (చిన్న-40) తన భార్యతో మోటార్ సైకిల్‌పై ఏలూరు వెళ్తుండగా మణుగులూరు వద్ద కారు ఢీకొంది. దీంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఏలూరు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ చిన్న మృతి చెందినట్లు గురువారం బంధువులు తెలిపారు. కార్ డ్రైవింగ్ చేస్తూ మోటార్‌సైకిల్ ను ఢీకొట్టి ప్రమాదానికి కారకురాలైన కైకలూరుకు చెందిన ఆశ్రమం ఆసుపత్రి డాక్టర్ చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'షర్మిల రాకతో వైసీపీకి ఓటమి గండం'

చాట్రాయి, జనవరి 25: సీఎం జగన్ చెల్లెలు షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పదవి చేపట్టడంతో వైసీపీకి ఓటమి గండం పొంచి ఉందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరాచక, అసమర్థ పాలన వలన ఇప్పటికే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీకి, షర్మిల రాక మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్టు అయిందన్నారు. వైసీపీ వైఫల్యాలు, అవినీతిని షర్మిల ఎండగట్టటం వలన టీడీపీకే మేలు జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ పెన్షనర్ల వినతి

ఆగిరిపల్లి, జనవరి 25: తమ సమస్యలు పరిష్కరించాలంటూ విశ్రాంత ఉద్యోగులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 11వ పీఆర్సీలో 2022 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ తిరిగి పునరుద్ధరించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు.

వాడపల్లిలో కామినేని ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ముదినేపల్లి రూరల్, జనవరి 25: మండలంలోని వాడవల్లి గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కామినేని శ్రీనివాస్ ఎంతో కృషి చేశారని అన్నారు. కామినేని మాట్లాడుతూ, అభ్యర్థిని ఎవర్ని నిలబెట్టినా గెలిపించుకోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

లోకేశ్‌ను కలిసిన అట్లూరి



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో టీడీపీ నూజివీడు నియోజకవర్గ నేత, అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అట్లూరి జితేంద్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోకవర్గంలోని రాజకీయ పరిస్థితులను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. - నూజివీడు

30న చింతలపూడి ఎత్తిపోతలపై నిరసన దీక్ష

నూజివీడు టౌన్, జనవరి 25: చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని కోరుతూ స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 30న నిర్వహిస్తున్న నిరసనదీక్షను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు, రైతుసంఘం నాయకులు చలసాని వెంకటరామారావు గురువారం పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి, మెట్టప్రాంతాల్లోని నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాల్లోని రెండు లక్షల ఎకరాలకు శాశ్వత సాగు, తాగునీరు అందించేందుకు 2009లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1ను ప్రారంభించటం జరిగిందన్నారు. ఎర్రగుంటపల్లి వద్ద ప్రారంభమయ్యే ఈ పథకం తమ్మిలేరు వరకు ఉందని, ప్రస్తుతం ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన అక్విడెక్ట్ నుంచిఫేజ్-2 ప్రారంభమై వేంపాడు మేజర్‌కు అనుసంధానం అవుతుందన్నారు. ఫేజ్ -1,2 పూర్తిచేయటానికి నాబార్డు రూ.1920 కోట్లు రుణం ఇవ్వడానికి ఆమోదించిందని, అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రెండుజిల్లాల్లోని మెట్టప్రాంతాల అభివృద్ధికి ఉద్దేశించిన సాగునీటి ప్రాజెక్టును అటకెక్కించిందన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించండి

నూజివీడు టౌన్, జనవరి 25:రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఎం.వి.ఐ జి.నాగమురళీ అన్నారు. ఆర్టీసీ బస్ డిపోలో రోడ్డుభద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని డ్రైవర్లు, సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. డ్యూటీకి ముందు విశ్రాంతి తీసుకోవాలని, తేలికపాటి ఆహారం తీసుకోవడంలోను, సమయపాలన, కొత్తటెక్నాలజీపై అవగాహన పెంచుకోవడంలో ముందు ఉండాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజరు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ ఎస్ఐ బదిలీ

నూజివీడు టౌన్, జనవరి 25: సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు సర్కిల్లో పలువురు ఎస్ఐలు గురువారం బదిలీ అయ్యారు. నూజివీడు రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న టి.రామకృష్ణను కైకలూరు బదిలీ చేశారు. జంగారెడ్డిగూడెంలో ఎస్ఐగా పనిచేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి రూరల్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ముసునూరు ఎస్ఐ..



కుటుంబరావు

ముసునూరు, జనవరి 25: ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు చింతలపూడి ఎస్ఐగా బదిలీ అయ్యారు. సుమారు 13 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు. రెండురోజుల్లో ముసునూరు ఎస్ఐగా కాకినాడలో విధులు నిర్వర్తిస్తున్న వాసు బాధ్యతల స్వీకరిస్తారని సమాచారం.

డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆసరా నిధులు..

ఆగిరిపల్లి, జనవరి 25: మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రాగ్రూపు సభ్యులకు నాలుగోవిడత రుణమాఫీ కింద నిధులు జమ చేశారు. హైస్కూల్లో గురువారం జరిగిన సభలో 1237 గ్రూపులకు రూ.12,55,67,440 జమ చేశామని ఎమ్మెల్యే తెలిపారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

కలిదిండి, జనవరి 25 : దుంపలకోడు దిబ్బలో రూ.55 లక్షలతో ఏర్పాటు చేసే తాగునీటి పైపులైన్ పనులకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపన చేశారు. తాడినాడ, పోతుమర్రు, సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఉద్దేశ్యంతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా అందిస్తామన్నారు.

ఆక్వా బోర్లతో ముప్పు!

» నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
» ఉప్పు నీటితో తాగునీరు కలుషితం
» అనారోగ్యంబారిన ప్రజలు
» పట్టించుకోని అధికారులు



కలిదిండి, జనవరి 25: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్టుగా ఆక్వా సాగుకు ఉప్పునీరు అవసరమని నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేస్తుండడంతో తాగునీరు కలుషితమౌతోంది. ఉప్పునీటికి ఏడు వందల అడుగులకు పైబడి బోర్లు వేస్తుండడంతో భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుంది. ఆక్వా చెరువుల్లో నీటిని కాలువల ద్వారా బయటకు వదలడం వల్ల తాగునీటి చెరువుల్లో చేరి ఉప్పునీటి శాతం పెరుగుతోంది. ఆ నీరు తాగి ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారు. బోర్లు తొలగించడంతో అధికారులు వైఫల్యం చెందుతుండడంతో వాటి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.

జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీంట్లో సుమారు లక్షా 20 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అధికశాతం అక్రమంగా వేసిన బోర్లతోనే సాగు చేస్తున్నారు. దీంతో భూగర్భజలాలు కలుషితమౌతున్నాయి. గతంలో కొన్ని మండలాల్లో అక్రమంగా ఉప్పునీటి బోర్లు వేసిన రైతులకు నోటీసులు ఇచ్చారు. ఆక్వా సాగులో ఉప్పునీటి బోరు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవంటూ అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ఎవరి పని వారిదే అన్నట్టుగా ఎన్నో అక్రమ బోర్లు వెలుస్తున్నాయి. సాధారణంగా 200 అడుగులు లోపు అయితే మంచినీరు వస్తుంది. రొయ్యల చెరువులకు ఉప్పునీరే కావాలి. దీనికోసం సుమారు 500 నుంచి 700 అడుగుల పైబడి బోరు తీయాల్సి ఉంటుంది. ఇటీవల అక్రమ బోర్లపై నిఘా పెట్టలేదు. చర్యలు తీసుకున్నది లేదు. దీంతో యథేచ్ఛగా బోర్లు వేస్తున్నారు.

ఉప్పునీటి బోర్లు వల్ల భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో బోర్లు వేస్తున్నారని, అందుకే అధికారులు అటువైపు చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్వా జోన్ పేరిట ఇష్టానుసారంగా చెరువులు తవ్వటం, పంట కాలువల వెంబడి ఎగువ ప్రాంతంలో ఉన్న చేపలు, రొయ్యల చెరువుల నీటిని పంట కాలువల్లోకి వదిలేయటంతో తాగునీరు కలుషితమవుతోంది. దీంతో మంచినీటి చెరువుల్లో ఉప్పునీరు సుమారు ఐదుశాతం ఉంటుందని, ఈ నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఉప్పునీటి బోర్లను తొలగించి పంట కాల్వలు, తాగునీటి చెరువులు కలుషితంబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.